నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 13 జూన్ 2024 | HYDERABAD

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు..

## 5లోగా జీతాలు

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : ప్రతి నెల 5వ తేదీలోపు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి హామీతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి నెల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 10 నుంచి 20వ తేదీ వరకు వేతనాలు రావడంతో కార్మికులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జలమండలి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ నేతృత్వంలో కార్మికులు.. ఎండీ సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆలస్యంగా జీతాలు రావడంతో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని ఎండీకి వివరించారు. ఈ నేపథ్యంలో కార్మికులకు ఇక నుంచి ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు అందిస్తామని ఎండీ హామీ ఇవ్వడంతో కార్మికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో కార్మికులు ఎండీ సుదర్శన్‌రెడ్డికి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నాయకులు శ్రీనివాసరెడ్డి, అంజనేయులు, కుమార్, బాల సుందర రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల కట్టడికి..

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాలను కట్టడి చేయడంలో భాగంగా హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో పాటు విద్యా సంస్థలు, కాలనీలు, బస్‌స్టాండ్, మెట్రో తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏసీపీ శివమారుతి ఆదేశాలతో తెలంగాణ పరిశ్రమ భవన్‌లో ఫెడెక్స్ మోసాలు, సిమ్ స్వాపింగ్, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలంటూ చేసే మోసాలపై తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సిబ్బందికి ఎస్సై ఉమా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ఈడీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఆశీష్‌కుమార్- విద్యాదీవెన' ఉచిత విద్యాశిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. -అబిడ్స్, జూన్ 12

వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి స్కూళ్లు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బోడుప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సందడి

# బడి బస్సులు భద్రమేనా?

**స్కూల్ ప్రారంభం రోజే.. రోడ్డెక్కిన ఫిట్‌నెస్‌లేని 77 బస్సులు**

**విద్యా సంస్థల యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి**

**నామమాత్రం తనిఖీలతో సరిపెడుతున్న ఆర్టీఏ**

**ప్రమాదాలు జరగకముందే మేల్కోవాలంటున్న పేరెంట్స్**

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : స్కూల్ బస్సులు యమపాశాలవుతున్నాయి. గత విద్యా సంవత్సరంలో పదుల సంఖ్యలో గ్రేటర్‌లో స్కూల్ బస్సులు చిన్నారులను చిదిమేశాయి. మళ్లీ ఇప్పుడు విద్యా సంవత్సరం మొదలైంది. గత ప్రమాదాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన ఆర్టీఏ అధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యా సంస్థలు ఎప్పటిలాగానే ఫిట్‌నెస్ లేని బస్సులను రోడ్డెక్కించి విద్యార్థులను తరలిస్తున్నాయి. స్కూల్ ప్రారంభం రోజే గ్రేటర్‌లో 77 బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడిచాయి. అధికారుల తనిఖీల్లో ఆ వాహనాలు సీజ్ అయ్యాయి. విద్యా సంస్థలు ప్రారంభమవ్వడానికి ముందే అన్నీ బస్సులు ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. అలాంటిది కొందరు అధికారులు తమ పరిధిలోని స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. ఆర్టీఏ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేయకుండా వారి పరిధిలోని అన్నీ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారిస్తే విద్యా సంస్థల బస్సుల గుట్టు రట్టవుతుందని చెబుతున్నారు. ప్రమాదం జరగకముందే మేల్కోవాలని పేరెంట్స్ ఆర్టీఏ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, హైదరాబాద్ జిల్లాలో 2,234, రంగారెడ్డిలో 5,500, మేడ్చల్‌లో 4,120 విద్యాసంస్థల బస్సులున్నాయి.

**గత విద్యా సంవత్సరంలో జరిగిన ప్రమాదాలివీ?**

- హయత్‌నగర్‌లోని కుంట్లూరు గ్రామంలో మూడేండ్ల బాలుడిని స్కూల్ బస్సు చిదిమేసింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగింది.
- హబ్సిగూడలో మూడేండ్ల చిన్నారిపై బస్సు టైరు ఎక్కింది. ఈ ప్రమాదంలో ఆ చిన్నారి మరణించింది. బ్రేకులు ఫెయిలైనా.. నిర్లక్ష్యంతో ఆ బస్సును నడిపించారు.
- బాచుపల్లిలో ఎనిమిదేండ్ల బాలికను స్కూల్ బస్సు బలి తీసుకున్నది. ఈ ఘటనలో డ్రైవర్ అతివేగంగా బస్సు నడిపినట్టు తేలింది.
- చర్లపల్లి డివిజన్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌లో నాలుగేండ్ల చిన్నారిని స్కూల్ బస్సు పొట్టనపెట్టుకున్నది.
- పెద్ద అంబర్‌పేటలో బ్రేకులు ఫెయిలైన స్కూల్ బస్సును డ్రైవర్.. రోడ్డెక్కించి విద్యార్థులను తరలిస్తుండగా, సెక్యూరిటీ గార్డును ఢీకొట్టింది. ఇలా ఎన్నో ప్రమాదాలు గత ఏడాది జరిగాయి.

## గోల్కొండ బోనాలు.. పనులు షురూ

నమస్తే ఎఫెక్ట్

మెహిదీపట్నం జూన్ 12: ఆషాఢ బోనాల కోసం గోల్కొండ కోటలో ఏర్పాట్లు మొదలయ్యాయి. బోనాల ఏర్పాట్లు ఇంకెప్పుడు..? శీర్షికతో 'నమస్తే'లో వచ్చిన కథనానికి దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం నుంచి ఎల్లమ్మ ఆలయంలో ఏర్పాట్లు ప్రారంభించారు. కాగా, ఇబ్రహీంబాగ్‌లో గోల్కొండ ఆలయ ఈవో శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయ సలహాదారు సిరుగుమల్లె రాజు వస్తాద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సారి బోనాలను ఎలాంటి లోటు పాట్లు లేకుండా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గోల్కొండ బోనాలు జూలై 7 నుంచి ప్రారంభం కానున్నాయని, ప్రతి ఆది, గురువారాల్లో తొమ్మిది వారాల పాటు జరుగుతాయని ఈవో శ్రీనివాస రాజు తెలిపారు. జూలై 7న (ఆదివారం) మొదటి పూజ, 11న (గురువారం) రెండో పూజ, 14న (ఆదివారం) మూడో పూజ, 18న (గురువారం) నాలుగో పూజ, 21న (ఆదివారం) ఐదో పూజ, 25న (గురువారం)ఆరో పూజ, 28న (ఆదివారం) ఏడో పూజ, ఆగస్టు 1న (గురువారం) ఎనిమిదో పూజ, ఆగస్టు 4న (ఆదివారం) తొమ్మిదో పూజ ఉంటుందని చెప్పారు.

అమ్మవారి ఆలయం వద్ద కొనసాగుతున్న బోనాల ఏర్పాట్ల పనులు

## వైభవంగా వైకుంఠనాథుడి బ్రహ్మోత్సవాలు

**హిమాయత్‌నగర్:** కలియుగ వైకుంఠనాథుడైన వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా మొదలయ్యాయి. గురువారం ధ్వజారోహణము, శేష వాహనంపై పద్మావతి గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు, హనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు ఉంటుందని టీటీడీ ఉపకార్యనిర్వహణాధికారి రమేశ్‌బాబు తెలిపారు.

# ప్రాణనష్టం జరగొద్దు

- పారిశుధ్య నిర్వహణ మరింత సజావుగా సాగాలి
- పురాతన భవనాలను కూల్చివేయాలి
- జీహెచ్ఎంసీ సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**వర్షాకాలం.. అప్రమత్తత అవసరం**

**బల్దియాకు సర్కారు అండగా ఉంటుంది**

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగర ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బల్దియా ఉన్నతాధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలితో కలిసి మాన్ సూన్ ప్రిపరేషన్ యాక్షన్ ప్లాన్, శానిటేషన్, వెటర్నరీ, ఫుడ్ సేఫ్టీ, నాలా, యూబీడీ, బక్రీద్ ఏర్పాట్లు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి జీహెచ్ఎంసీ పరిధిలో మాన్‌సూన్ ప్రిపరేషన్ యాక్షన్ ప్లాన్‌ను మంత్రికి వివరించారు. అనంతరం ఆయా విభాగాల అధికారులు మాన్ సూన్ సంసిద్ధత ప్రణాళికపై చేపట్టిన చర్యల గురించి మంత్రికి వివరించారు. 141 మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించామని, సమస్య పరిష్కారానికి పనులు చేపట్టామని తెలిపారు. నాలాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని, మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను ఏర్పాటు చేసి 24 గంటలు అప్రమత్తతతో పనిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. నాలా ప్రమాదాలు జరగకుండా నాలా అడిట్ చర్యలు తీసుకున్నామని, ఒక్కొక్క ఏరియాకు ఇన్‌చార్జి ఆఫీసర్లుగా 203 మంది అధికారులకు నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

**సమన్వయంతో పనిచేయండి**

పురాతన భవనాలు, కాంపౌండ్ వాల్స్ గుర్తించి కూల్చివేయడం, ఖాళీ చేయించడం, రిపేర్ చేయడంతో పాటు సీజ్ చేస్తున్నామని, సెల్లార్స్ కూడా గుర్తించి లేబర్ క్యాంప్స్ ఉంటే ఖాళీ చేయిస్తున్నామని, సెల్లార్ తవ్వడం ఈ సీజన్‌లో బ్యాన్ చేశామని మంత్రికి సంబంధిత అధికారులు వివరించారు. మ్యాన్ హోళ్ల వద్ద అన్ని విధాలా సేఫ్టీ చర్యలు తీసుకుంటున్నామని, రౌండ్ ది క్లాక్ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా, వర్షాకాలంలో ఎలాంటి ప్రకృతి విపత్తులు వచ్చినా ఎదుర్కొనేలా అవసరమైన అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నామని విద్యుత్ అధికారులు వివరించారు. ప్రకృతి విపత్తులు, వర్షాలు వరదల వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఆయా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం జీహెచ్ఎంసీకి అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

బుధవారం బల్దియాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి

### ఆటో డ్రైవర్లను ఆదుకోండి..

ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ అధ్యక్షుడు లిఖిత్ కుమార్, ఉపాధ్యక్షుడు హబీబ్, ప్రధాన కార్యదర్శి సమ్మయ్యయాదవ్ బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్కూల్స్ ప్రారంభం కావడంతో పిల్లల ఫీజులు చెల్లించలేక ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### వన మహోత్సవానికి సిద్ధంగా ఉండండి

నాలాల్లో డి-సిల్టింగ్ ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలని, ప్రజలు కూడా నాలాలో వ్యర్థాలు వేయవద్దని, ప్రవాహం సాఫీగా వెళ్లేలా చూడాలని మంత్రి పొన్నం సూచించారు.. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుక్కలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణ సజావుగా జరగాలని, క్షేత్ర పరిధిలో పర్యవేక్షించాలన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలో నాణ్యమైన, హైజినిక్ ఫుడ్ అందించేలా చూడాలని చెప్పారు. ఫుడ్ సేఫ్టీకి సంబంధించి ప్రతి జోన్‌కు ఒక వాహనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ సంవత్సరం వన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ఈ కార్యక్రమం సందర్భంగా ప్రజలకు అవసరమైన, జామ, కారివేపాకుతో పాటు అడిగిన మొక్కలను ఇవ్వాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్‌కు సంబంధించినవి డిస్‌ప్లే చేయాలని, లే క్స్ ప్రొటెక్షన్‌పై దృష్టి సారించాలని, లేక్స్ డెవలప్‌మెంట్స్ సీఎస్ఆర్ కింద చేపట్టాలని, కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు అందించేలా చూడాలని మంత్రి చెప్పారు.

### బక్రీద్‌కు ముమ్మర ఏర్పాట్లు చేయాలి

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయాలని మంత్రి సూచించారు. చికెన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా బల్దియా ఆదాయం పెంపొందించుకోవడానికి ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పురాతన భవనాలు, నివాసయోగ్యం లేని భవనాలు గుర్తించి కూల్చివేయాలన్నారు. డివిజన్ స్థాయిలో స్లమ్ ఏరియాల్లో తిరిగి అక్కడికక్కడే సమస్య పరిష్కరించేలా ప్రణాళిక చేయాలన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్సీ జియా ఉద్దీన్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వర రావు, సీఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు, స్నేహ శబరిష్, అభిలాష అభినవ్, హేమంత్ సహదేవ్ రావు, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు కే శ్రీవాత్సవ, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మా జీవితాల్లో వెలుగులు నింపండి

స్వయం ఉపాధి పథకంలో రుణాల ద్వారా కార్లు కొనుగోలు చేసి డ్రైవర్ కం ఓనర్ డ్రైవర్లమైన తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ పలువురు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బల్దియాలో కలిసి వినతిపత్రం సమర్పించారు. డ్రైవర్ కం ఓనర్స్ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కొందరు అధికారులు, బినామీ పేర్లతో ట్రావెల్స్‌తో తమ వాహనాలను పక్కన పెట్టి.. ఉపాధికి గండి కొడుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్స్ కం ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవేందర్ కోరారు. ప్రస్తుతం ధరలకు అనుగుణంగా ప్యాకేజీని పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### డీఎస్సీ నిర్వహిస్తాం: మంత్రి పొన్నం

పేదలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్యార్థుల డ్రాప్‌ఔట్స్ లేకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. నాంపల్లిలోని అలియా ప్రభుత్వ పాఠశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26,872 ప్రభుత్వ పాఠశాలల్లో 11 వందల కోట్లతో వసతులు కల్పించామని చెప్పారు. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షలో అత్యుత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, అదనపు కలెక్టర్ హేమంత్ పాటిల్ కేశవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత తదితరులు పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్‌లో కొన్ని పాఠశాలల్లో ఉదయం అల్పాహారం అందించలేదని విద్యార్థులు తెలిపారు. యూనిఫాంలు కూడా అందరికీ పంపిణీ చేయలేదని చెప్పారు.

**జాతీయ స్థాయి** పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 83 కిలోల విభాగంలో 170 కిలోల డెడ్ లిఫ్ట్ బరువును ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్న రాచకొండ కమిషనరేట్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రదీప్‌కుమార్‌ను బుధవారం రాచకొండ సీపీ తరుణ్ జోషి అభినందించారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో ప్రదీప్‌కుమార్ విజయం సాధించి యువకులకు ఆదర్శంగా నిలిచారని సీపీ కొనియాడారు. సీపీని కలిసిన వారిలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ సుగుణ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సీనియర్ అకౌంటెంట్ అభినవ్ తదితరులు ఉన్నారు.

-సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ)

## • మోస్తరు నుంచి భారీ వర్షాలు

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): చురుకుగా కదులుతున్న రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కిందిస్థాయి గాలుల ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినట్లు చెప్పారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.6, కనిష్ఠం 23.0 డిగ్రీలు, గాలిలో తేమ 58 శాతంగా నమోదైనట్లు తెలిపారు.